



# రాజకీయం

రావినూతల సువర్ణాకన్నన్

అది ఓ జూనియర్ కాలేజ్.

సాయంత్రం అయిదు గంటలు కాకుండానే ఆకాలేజ్ బిల్డింగ్ టెరస్‌మీద అత్యవసర సమావేశం జరిగింది చైర్ మెన్ ఆదేశం మేరకు. నిన్నటి దాకా అది జూనియర్ కాలేజీయే. డిగ్రీ కి సంబంధించిన భవంతికి పునాదిరాయి గవర్నర్ వేశారు. ఓపెనింగ్ మాత్రం అపూరివాడే అయిన చక్రవర్తి చెయ్యబోతున్నాడు.

చక్రవర్తి సాదాసీదా మనిషి కాదు. ఛీఫ్ మినిస్టరు. లక్ష్మీపుత్రుడు. రాజకీయ రంగంలో బాగా పలుకుబడి వున్నవాడు. దానికితోడు రాబోయే ఎన్నికల్లో కూడా ఇతనే ఛీఫ్ మినిస్టర్ అన్న నమ్మకం అక్కడి వాళ్లందరికీ వుంది. అందుకే కాలేజీ భవంతి ఆయన చేత ఓపెన్ చేయిస్తే, అతగాణ్ణి ఎన్నో రకాలుగా పుపయోగించుకోవచ్చన్న ముందు చూపుతో కాలేజీ కమిటీ అంతా కూడబలుక్కుని రెండు నెలలకి ముందే చక్రవర్తి చేత ''సరే'' అనిపించుకొన్నారు.

అయితే హఠాత్తుగా పరిస్థితి తారుమారయింది. చక్రవర్తి కొడుకు ఓ హరిజన యువతి మీద అత్యాచారం చెయ్యబోయాడన్న వార్త పూరంతా గుప్పుమంది. అంతవరకు చక్రవర్తిని దేవుళ్ళా చూసిన వాళ్ళంతా అతన్ని తూలనాడారు. యువకులు నిప్పుల్లా మండి పడ్డారు. సమయం చూసిన ప్రతిపక్షులవారు ఆ మంటలో నాలుగు సమిధలు తగిలించి పెట్రోల్ కుమ్మరించి మంటని ఆకాశాన్నంటేలా చేశారు.

అంతే! గొడవలు! దొమ్మీలు, దోపిడీలు, మాన భంగాలు! పూరంతా కురుక్షేత్రంలా మారిపోయింది. సమయం దొరికింది కదా అని పాత కక్షలు తీర్చుకుంటున్నారు అవకాశ వాదులు. ఇలాంటి సంఘటనల కోసమే ఎదురు చూసే దుర్మార్గులు కనిపించిన వస్తువుల్ని నాశనం చేస్తూ, అందినంత సొమ్ముని చేజిక్కించుకుని చల్లగా జారుకుంటున్నారు.

పోలీసులు రంగంలోకి దిగారు. వన్ ఫార్టీ ఫోర్ పెట్టారు. సంబంధం లేకపోయినా అందిన వాళ్లని పట్టుకుని చితకబాదారు. అయినా అగ్ని చల్లారలేదు. ''చక్రవర్తి రాజీనామా చెయ్యాలి'' అని పట్టు పట్టాయి ప్రతిపక్షాలు. జనంచేతా అదేమాట చెప్పించాయి. అలాంటి పరిస్థితుల్లో చక్రవర్తి రాజీనామా చెయ్యక తప్పలేదు.

ప్రెసిడెంట్ రూల్ వొచ్చాక అంతాశాంతించారు జనం. ఈసారి చక్రవర్తికి చీఫ్‌మినిస్టర్ మాట టుంచి, డిపాజిట్ కూడా దక్కనీకూడదని నిర్ణయించుకున్నారు.

కృంగిపోయాడు చక్రవర్తి.

తన ఈ పరిస్థితికి కారకుడైన కొడుకుని తిట్టిపోశాడు. జ్యోతిష్కుల్ని పిలిపించి జాతకం చూపించుకున్నాడు. ''నీ రాజకీయ జీవితం అయిపోయింది'' అన్నారు జ్యోతిష్కులు కచ్చితంగా.

ఇంకారోజునించే చక్రవర్తిని పలకరించే నాథుడే కరువైపోయాడు. అంతకు ముందు అతనిముందు చేతులుకట్టుకుని ఒంగి ఒంగి మరీమాట్లాడే వాళ్ళు సైతం, అతన్ని తప్పించుకు తిరగసాగారు.

ప్రస్తుతం జరిగే అత్యవసర సమావేశం దానికి సంబంధించిందే!

''ప్రస్తుతం చక్రవర్తి కోరలు తీసేసిన పాము. ఒట్టి పోయిన గొడ్డు. ముందు ముందు మళ్ళీ పదవిలోకి ఒస్తాడన్న ఆశకూడా లేదంటున్నారంతా. అలాంటి వాడిచేత మన కాలేజీ ఓపెన్ చేయించడం నామటుకు నాకు ఇష్టంలేదు మరి మీ అభిప్రాయం ఏమిటి?'' అన్నాడు చైర్‌మన్ మెంబర్లకేసి చూస్తూ.

''మాకూ ఇష్టంలేదు'' కోరస్‌గా అన్నారంతా.

''కానీ మనం ఆయన్ని ఆహ్వానించేశాంగా?'' అన్నాడు భయస్థుడైన ఓ మెంబరు.

''పిలిస్తే మాత్రం ఏం? ఫంక్షన్ పోస్ట్‌పోన్ అయిందని ప్రస్తుతానికి తప్పించుకుని, తర్వాత పరిస్థితుల్ని బట్టి ఎవర్ని పిలవాలో నిర్ణయిద్దాం'' అన్నాడు చైర్‌మన్.

ఈ మాట అందరికీ నచ్చింది. అయితే ఈ విషయాన్ని చక్రవర్తికి ఎవరు చెప్పాలి అన్న విషయానికొచ్చే సరికి అంతా మౌనంగా వుండి పోయారు. ఎంత పదవిపోయినా, నిన్నటి దాకా ఛీఫ్ మినిస్టర్‌గా వున్న చక్రవర్తి దగ్గరికెళ్ళి విషయాన్ని చెప్పడానికి మాత్రం ఎవరికీ ధైర్యం చాల్లేదు.

అందరూ ఆలోచించి ఆలోచించి, తమకాలేజీలో టైపిస్ట్‌గా పనిచేసే సుబ్బారావు చేత చెప్పించాలని నిర్ణయించుకున్నారు.

పేదవాడైన సుబ్బారావు స్వతహాగా కాస్త మెతక

వాడు. మంచివ్యక్తి. తీరిక సమయాల్లో రచనలు చెయ్యడం అతని హాబీ.

అనుకున్నదే తడవుగా సుబ్బారావుని పిలిపించి ఓకవరిచ్చి, అతనేం చెప్పాలో వివరించి మరీపంపారు.

వాళ్ళప్లాన్ విన్న సుబ్బారావు నిర్ఘాంత పోయాడు. నిన్నటి దాకా చక్రవర్తి కాళ్ళుపట్టడాని క్కూడా వెనకాడనట్టుండే ఈ పెద్దమనుషులు, ఆయనకి పదవిపోగానే ఇంత హీనంగా చూస్తారా?' అనుకుని బాధపడ్డాడు. కానీ ఆమాట పైకి అనడానికి అతని కెన్ని గుండెలు? అందుకే మౌనంగా కవరు తీసుకుని చక్రవర్తి ఇంటికెళ్ళాడు.

చక్రవర్తి ఇంటి ముందు మునుపటిలా కార్లు బారులుతీరి లేవు. మందీ మార్బలం లేదు, అతని స్వంత నౌకర్లుతప్ప.

సుబ్బారావు వెళ్ళేసరికి చక్రవర్తి ఇంట్లోనే వున్నాడు. చక్రవర్తి అనుమతితో లోపలికెళ్ళాడు సుబ్బారావు. వెళ్తూనే వినయంగా విష్ చేసి, వాళ్ళిచ్చిన కవరు ఇచ్చి, వాళ్ళు చెప్పమన్న మాటలు చెప్పాడు.

లెటర్ చూసుకున్న చక్రవర్తి మొహం కళ తప్పింది. పేలవంగా నవ్వి,

''ఇట్సాల్‌రైట్! నాకూ మనసు బాగాలేదు. ఇప్పుడు రమ్మన్నా వచ్చేలా లేను'' అన్నాడు. తర్వాత సుబ్బారావుని గురించి అడిగి అతని వివరాలు తెలుసుకున్నాడు. అతని రచనల్ని తమ పిల్లలు ఎంత ఇష్టంగా చదువుతారో చెప్పాడు. అయితే అతను కాలేజీ లో చిన్న వుద్యోగి అని మాత్రం తెలియదని, తెలిస్తే తనే అతనికి మంచి భవిష్యత్తుని కలిగించే వాణ్ని అన్నాడు. ఆప్యాయంగా కరచాలనం చేశాడు. కూల్ డ్రింక్స్ తెప్పించాడు. చివరగా-

''మీకు నావల్ల ఎలాంటి సాయంకావాలన్నా నిస్సంకోచంగా అడిగి చేయించుకోవచ్చు.'' అంటూ అభయం ఇచ్చి గేటు దాకా వెళ్ళి సాగనంపాడు.

పొంగి పోయాడు సుబ్బారావు.

''ఇంత మంచి వ్యక్తికి వాళ్ళంతా తీరని అన్యాయం చేశారు.'' అని మరోసారి కాలేజీ కమిటీని తిట్టుకున్నాడు.

తర్వాత కాలేజీ భవంతి ఒక గొప్ప వ్యాపారవేత్త చేత ఓపన్ చేయించారు కమిటీవారు. ఆ ఫంక్షన్‌కి ఇన్‌విటేషన్ చక్రవర్తికి పంపారో లేదో అన్నది కూడా అనుమానమే.

కాలప్రవాహంలో రోజులు, నెలలు దొర్లిపోయాయి. ఎలక్షన్లయి ఫలితాలుకూడా తెలిశాయి.

''చిత్రమైనది విధినడక'' అన్నట్లు, డిపాజిట్ పోగొట్టుకుంటాడనుకున్న చక్రవర్తి అధిక మెజారిటీతో గెలవడమేగాక తిరిగి ఛీఫ్ మినిష్టరయి కూర్చున్నాడు. దానికి కారణం, ఏ హరిజనయువతి మీద తన కొడుకు అత్యాచారం చెయ్యబోయాడో, ఆ యువతినే చక్రవర్తి తన కోడలిగా చేసుకోనడమే!


చక్రవర్తి తిరిగి పదవిలోకి వచ్చాడని విని ఆనందించిన వాళ్ళలో మొదటివాడు సుబ్బారావు. తన ఆనందాన్ని స్వయంగా ఆయనతో చెప్పుకోవాలన్నట్టు సి.ఎమ్. ఇంటికేసి నడిచాడు.

ఎప్పటిలా సి.ఎమ్. ఇంటి పరిసరాలు సందడిగా వున్నాయి. చక్రవర్తి ఇంటి పక్కగా వున్న తోటలో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

ఫోన్లు మోగుతూనే వున్నాయి. ఆయన అభినందనలు అందుకుంటూనే వున్నాడు.

లోపలికెళ్ళ బోతున్న సుబ్బారావుని గేటు బైట ఆపేశారు సెక్యూరిటీ వాళ్ళు. తనని గురించి ఎంత చెప్పుకున్నా వాళ్ళు వినిపించుకోలేదు. అయితే తమ యజమాని సుబ్బారావుని ఆప్యాయంగా పలకరించడం, కూల్ డ్రింక్స్ ఇవ్వడం, వీధి వరకూ వచ్చి సాగనంపడం గుర్తొచ్చిన ఆ ఇంటి నౌకరు సుబ్బారావుని లోపలికి తీసికెళ్ళాడు.

భవంతి పక్కగా వున్నలాన్‌లో వేసిన కుర్చీలో కూర్చుని వున్నాడు చక్రవర్తి. అతనికి విష్ చెయ్యబోయిన సుబ్బారావు, చక్రవర్తికి ఎదురుగా చేతులు నలుపుకుంటూ అతి వినయంగా మాట్లాడుతున్న వాళ్ళని చూసి ప్రతిమలా అయిపోయాడు.



తెల్లవారితే కూరకు పనికి రావేమోన్నంతగా టామెటోలు మెత్తబడినట్లు అనిపించాయా? చల్లని నీటిలో రెండు చెంచాలు ఉప్పువేసి అందులో టమోటాలు పడవేయండి. మరుసటి రోజు మీరు కూరవండే సమయానికి అందుకు తగినంత గట్టిగా టమోటాలు మీ ముందుకు ప్రత్యక్షం.

బి.ఎస్. లక్ష్మి

ఆ మాట్లాడేది ఎవరోకాదు. తమ కాలేజీ ఛైర్మన్, తదితరులు! వాళ్ళంతా అతివినయంగా ఏదో చెప్తుంటే చిరునవ్వులు చిందిస్తూ వింటున్నాడు చక్రవర్తి.

''తమరు పదవిలో లేక పోయేసరికి మాకు వూపిరి ఆగనట్టయిందనుకోండి. అసలు మీ ఎదుట పడి మాట్లాడ్డానికే మాకు మనసు రాలేదు. మీ మొహాన్ని చూస్తే మేం ఏమయిపోతామో అనిభయం కూడా వేసింది. హమ్మయ్య! మళ్ళీ మీరు పదవిలో కొచ్చేశారు. అయినా మీ దర్జా, మీ ఠీవీ ఇంకెవరికున్నాయండీ!'' అన్నాడు ఛైర్‌మన్.

''మీ అభిమానం అలాంటిది!'' నవ్వాడు చక్రవర్తి.

షాక్ నించి తేరుకున్న సుబ్బారావు, చక్రవర్తి దగ్గరికెళ్ళి వినయంగా విష్ చేశాడు.

''ఎవరు!'' అన్నట్టు కళ్ళుచిట్లించి చూశాడు చక్రవర్తి

''నేనుసర్! రచయిత సుబ్బారావుని!'' తనని మర్చిపోయాడేమో అనుకుని గతాన్ని గుర్తు చేశాడు సుబ్బారావు.

''నువ్వు రచయితవా?'' ఏదో ఆలోచిస్తూ అన్నాడు చక్రవర్తి. సుబ్బారావు మొహం చిన్నబోయింది.

''అదే సర్.. ... అప్పుడు ... '' ఏదో అనబోయాడు అయితే అదేం వినిపించుకోకుండా

''ఎప్పటి సంగతులో వినడానికి నాకు టైమ్ లేదు. ఇప్పుడెందుకొచ్చావో చెప్పు!'' అన్నాడు చక్రవర్తి చిరాగ్గా.

అతని ధోరణికి విస్తుపోయాడు సుబ్బారావు.

''నువ్వెందుకొచ్చావిక్కడికి?'' కొట్టినట్టే అడిగాడు ఛైర్‌మన్.

''అదే ... మంత్రిగారు ...'' కంగారులో సుబ్బారావుకి మాట రావడం లేదు.

''ఆ నేనేనయ్యా మంత్రిగార్ని. నువ్వెవరివి? ఏంకావాలి!'' అసహనంగా అరిచాడు చక్రవర్తి.

సుబ్బారావుని లోపలికి తీసుకొచ్చిన నౌకరు కాస్త ధైర్యం చేసి చెప్పాడు.

''అయితే ఏమిటి?'' అన్నాడు చక్రవర్తి

''అదే ... నా రచనలు మీరు చదువుతారని ...! అంతవరకూ ఫయిల్లో భద్రపరిచిన రెండు చిన్న పుస్తకాలు తీశాడు సుబ్బారావు.

చక్రవర్తి మొహంలో అంతులేని విసుగు చోటు చేసుకుంది.

'' ఇలాంటి అడ్డమైన పుస్తకాలూ చదవడానికి నాకు తీరికెక్కడిదయ్యా! ఆ పుస్తకాలు మా ప్యూన్‌కిచ్చి వెళ్ళు'' అన్నాడు.

సుబ్బారావు మొహం వెలవెల పోయింది.

''యాదయ్యా! అతని దగ్గరి పుస్తకాలు తీసుకుని అతన్ని బైటికి పంపెయ్యి'' అన్నాడు సి. ఎమ్. నౌకరుతో.

నౌకరు సుబ్బారావుకేసి జాలిగా చూస్తూఅతని చేతిలోని పుస్తకాలు తీసుకుని, పదమన్నట్టు సైగ చేశాడు.

నీరసంగా కదిలాడు సుబ్బారావు.

''అతగాడో రచయితట! అన్నట్టు అతగాడు మీ కాలేజీలో పని చేస్తున్నాడనుకుంటాను!'' అన్నాడు చక్రవర్తి ఛైర్మన్‌తో.

''రచయితా పాడా! ఏదో తోచనప్పుడు గిలుకుతుంటాడు. కానీ తనో పెద్ద రచయితనని అతని నమ్మకం. మన కాలేజీలో టైపిస్ట్ పోస్ట్ ఇచ్చాం. అది ఆసరాగా తీసుకుని సరాసరి తమ దగ్గరికే వచ్చిగొప్పలు చెప్పుకుంటున్నట్టున్నాడు.'' పెద్దగా నవ్వుతూ అన్నాడు ఛైర్‌మన్.

ఇవన్నీ సుబ్బారావుకి వినిపిస్తూనే వున్నాయి. పదవి ఎంత గొప్పదో మనిషిచేత ఎన్నిరకాలుగా నాటకాలాడిస్తుందో అతనికి అర్థమైంది.

అతని కళ్ళలో నీళ్ళూరాయెందుకో. ఆ నీళ్ళని ఎవరూ చూడకూడదన్నట్టు తల వంచుకుని రోడ్డున పడ్డాడు.

''పాపం! అమాయకుడు! రాజకీయాల గురించి తెలియదు.'' జాలిగా అనుకున్నాడు నౌకరు యాదయ్య. □